క్లుప్తంగా

లక్ష్మణరావుకు డాక్టరేట్



రాజాం: మండలంలోని ముద్దాడజోగివలసకు చెందిన బాణాన లక్ష్మణరావును డాక్టరేట్ వరించింది. ప్రొఫెషర్ గుజ్జు చిన్నారెడ్డి గైడెన్స్‌లో ఏన్ ఎఫికసీ ఆఫ్ ఫార్ట్స్ ఆఫ్ స్పీచ్ అమాంగ్ 8 అండ్ 9 క్లాస్ స్టూడెంట్స్ ఇన్ సెలక్ట్ హైస్కూల్స్ ఆఫ్ నార్త్ కోస్టల్ ఆంధ్రప్రదేశ్ అనే అంశంపై ఆయన చేసిన పరిశోధనలకు గాను ఆచార్య నాగార్జున యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు. ప్రస్తుతం లక్ష్మణరావు జీఎంఆర్ఐటీ కళాశాలలో ఇంగ్లిష్ అసిస్టెంట్ ప్రొఫెషర్‌గా పని చేస్తున్నారు. ఈ మేరకు ఆయనను జీఎంఆర్ ఐటీ కళాశాల ప్రిన్సిపాల్ సి.ఎల్.వి.ఆర్.ఎస్.వి.ప్రసాద్, గ్రామస్తులు అభినందిస్తున్నారు.

వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత



బాధిత కుటుంబానికి వైఎస్సార్ బీమా నగదు అందజేస్తున్న సర్పంచ్ శ్రీనివాసరావు

బాడంగి: మండలంలోని కోటిపల్లి గ్రామంలో ఇదే గ్రామానికి చెందిన మానాపురం ఆనంద రావు ఇటీవల మృతి చెందగా, బాధిత కుటుంబానికి వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద రూ.10 వేలను సర్పంచ్ ఎం.శ్రీనివాసరావు చేతులమీదుగా శనివారం అందజేశారు. మిగతా రూ.90 వేలను నామినీ బ్యాంకు ఖాతాలో వేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి టి.రాఘవేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

స్త్రీనిధి రుణాల లక్ష్యాలు చేరుకోవాలి



మాట్లాడుతున్న ఏజీఎం ఉమామహేశ్వరరావు

రాజాం: స్థానిక క్లస్టర్ పరిధిలో స్త్రీనిధి రుణాల లక్ష్యాలు చేరుకోవాలని డీఆర్‌డీఏ ఏజీఎం ఎ.ఉమామహేశ్వరరావు సూచించారు. శనివారం స్థానిక స్త్రీనిధి భవనం వద్ద క్లస్టర్ పరిధిలోని సీసీలు, సీఎఫ్‌లతో సమావేశమైన ఆయన నియోజకవర్గంలో ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.25 కోట్ల స్త్రీనిధి రుణాలను లక్ష్యంగా చేసుకున్నామని, వీటి ద్వారా లబ్ధిదారులకు ఆర్థిక భరోసా ఏర్పడుతుందన్నారు. నియోజకవర్గంలో ఇప్పటివరకు రూ.9 కోట్ల మేర స్త్రీనిధి రుణాలు ఇవ్వడం జరిగిందన్నారు. కార్యక్రమంలో రాజాం క్లస్టర్ మేనేజర్ సుధాకర్‌రావు, వైఎస్సార్ క్రాంతి పథం ఏసీ చిరంజీవి, ఏపీఎంలు దధికుమార్, సీతారాం, చక్రపాణి, మంగమ్మలు తదితరులు పాల్గొన్నారు.

14 రకాల టెస్టులు.. 64 రకాల మందులు

రేగిడి: ప్రజారోగ్యమే ప్రభుత్వ లక్ష్యమని, 104 వాహనం ద్వారా ప్రతీ గ్రామానికి వైద్యసేవలు అందజేయడం జరుగుతోందని రేగిడి పీహెచ్‌సీ వైద్యాధికారి సోహినీ రాఘవ్ తెలిపారు. మండలంలోని వన్నలి గ్రామంలో శనివారం జరిగిన 104 వాహన వైద్య శిబిరానికి హాజరైన రోగులకు ఆమె ఆరోగ్య తనిఖీలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం ప్రజల ఆరోగ్యం కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకుంటున్న చర్యలను వివరించారు. రోగులకు 14 రకాల టెస్టులు చేయడంతో పాటు 64 రకాల మందులు అందజేయడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో ఎం.ఎల్.హెచ్.పి.ప్రియ, ఏఎన్ఎం రాజేశ్వరి, సర్పంచ్ జి.రమణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పౌష్టికాహార మాసోత్సవాలు



పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న సర్పంచ్ క్రిష్ణవేణి

వంగర: మండలంలోని కొత్తమరువాడ అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార మాసోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. శనివారం జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ క్రిష్ణవేణి పాల్గొని, గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం ద్వారా ప్రభుత్వం అందజేసే పౌష్టికాహారం ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని, ప్రతిఒక్కరూ ప్రతిరోజూ పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పాతమరువాడ, కొత్తమరువాడ, సీతాదేవిపురం అంగన్‌వాడీ కార్యకర్తలు కె.సూరమ్మ, ఎస్.ఇందిరబాల, ఎస్.హైమావతి, వి.చినతల్లి తదితరులు పాల్గొన్నారు.

ఖరీఫ్ సాగుపై..చిగురించిన ఆశలు

ఖరీఫ్ సాగుకు కోటిఆశలతో ముందుకొచ్చిన రైతన్నను ప్రారంభంలో వర్షాలు ఊరించి, ఉసూరుమనిపించినా ఆ తర్వాత తర్వాత కురిసిన వర్షాలు వ్యవసాయ పనులకు అనుకూలించాయి. దమ్ములు (దుక్కి పనులు), వరి నాట్లు, ఉభాలంతా చకచకా జరిగిపోయి ఇప్పుడు పొలాలు పచ్చదనంతో నిండిపోయాయి. అంతటా ఇదే పరిస్థితి నెలకొనడంతో అన్నదాతల్లో ఆశలు చిగురిస్తున్నాయి.



రామభద్రపురంలో ఏపుగా పెరుగుతున్న వరి పంట

- ఆశాజనకంగా ఖరీఫ్ సాగు
- సమృద్ధిగా వర్షాలు కురుస్తుండడంతో అన్నదాతల్లో ఆశలు
- బొబ్బిలి నియోజకవర్గంలో 32,857 ఎకరాల్లో వరి సాగు



కొండకెంగువలో వరిలో సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన కల్పిస్తున్న వీఏఏ అప్పలనాయుడు

రామభద్రపురం: రాష్ట్రంలో ఎప్పుడూ లేని విధంగా జూలై నెలతో పాటు ఆగస్టు రెండో వారం వరకు తీవ్ర ఉష్ణోగ్రత నమోదయ్యాయి. వరినాట్లు వేసే సమయంలో కూడా నెలకొన్న వర్షాభావ పరిస్థితులతో అన్నదాతలు ఈ ఏడాది వ్యవసాయంపై ఆశలు వదులుకున్నారు. అయితే నెల రోజుల క్రితం నుంచి కురుస్తున్న వర్షాలకు దాదాపు 90 శాతం మేర వరినాట్లు వేసుకున్నారు. బొబ్బిలి నియోజకవర్గంలో సాధారణంగా 36,231 ఎకరాల్లో వరి పంట సాగు చేయాల్సి ఉండగా, 32,857 ఎకరాల్లో సాగు చేశారు. రామభద్రపురం మండలంలో 3,613 ఎకరాలకు గాను 3,513 ఎకరాలు, బొబ్బిలి మండలంలో 16,712 ఎకరాలకు గాను 14,572 ఎకరాలు, తెర్లాం మండలంలో 9,993 ఎకరాలకు గాను 9,128 ఎకరాలు, బాడంగి మండలంలో 5,913 ఎకరాలకు గాను 5,644 ఎకరాల్లో వరి సాగులో ఉంది. వరినారు ఎండిపోతుందనుకుంటున్న సమయంలో వర్షాలు కురవడంతో పంట ఆశాజనకంగా ఉంది. కాస్త ఆలస్యమైనా సకాలంలోనే వర్షాలు కురిశాయని, అధిక దిగుబడులు వస్తాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. పంట పెరుగుదల సమయంలో పంటను ఆశించే తెగుళ్ల, చీడపీడల నివారణకు వ్యవసాయాధికారుల సలహాలు, సూచనల మేరకు సాగులో సస్యరక్షణ చర్యలను రైతులు చేపడుతున్నారు. వరిలో కాలిబాటలు కూడా వేసుకోవడంతో గాలి, వెలుతురు బాగా తగిలి పంట ఏపుగా పెరుగుతోంది.

సకాలంలో విత్తనాలు, ఎరువులు..

ప్రకృతి వ్యవసాయ విధానాలను కూడా రైతులు అవలంభిస్తుండడంతో సాగు బాగుంది. దీంతో పాటు ప్రభుత్వం కూడా రైతు భరోసా కేంద్రాల ద్వారా సకాలంలో విత్తనాలు, ఎరువులు సరఫరా చేయడంతో రైతన్నకు వ్యవసాయ ఇబ్బందులు తప్పాయి. ఈ-క్రాప్, ఈకేవైసీ నమోదు, పంట విక్రయం కూడా ప్రభుత్వమే చూసుకుంటుండడంతో అన్నదాతకు చాలావరకు కష్టాలు తప్పాయి. రైతు భరోసా పథకం కింద సాగుకు ఆర్థికసాయం, వ్యవసాయ రుణాలు కూడా జగనన్న సర్కారు ఇస్తుండడంతో ఆయన పాలనపై హర్షం వ్యక్తం చేస్తున్నారు. రైతను రాజును చేస్తున్న ఏకైక నాయకుడిగా మెచ్చుకుంటున్నారు. ఈ ఏడాదీ వ్యవసాయం అనుకూలిస్తే తమ జీవితాలు బాగుంటాయని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

> **భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు..**
>
> భూసార పరీక్షల ఫలితాల ఆధారంగానే ఎరువులు వాడాలి. వరిపైరులో కాలిబాటలు వేసుకోవడం వల్ల పైరుకు పట్టే తెగుళ్ల, చీడపీడలు గుర్తించవచ్చు. పంట చేతికి వచ్చినంత వరకు రైతులు అప్రమత్తంగా ఉండి, అన్ని జాగ్రత్తలు తీసుకోవాలి.
>
> వెంకటయ్య, ఏవో, రామభద్రపురం.

శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలి

- ఎస్పీ ఎం.దీపికా పాటిల్



సచివాలయ మహిళా పోలీసులతో మాట్లాడుతున్న ఎస్పీ దీపికా పాటిల్

తెర్లాం: రానున్న సార్వత్రిక ఎన్నికలు దృష్టిలో ఉంచుకుని, గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలని ఎస్పీ ఎం.దీపికా పాటిల్ సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా స్థానిక పోలీస్‌స్టేషన్‌ను శనివారం సందర్శించిన ఆమె మండలంలోని గ్రామ సచివాలయాల్లో పనిచేస్తున్న మహిళా పోలీసులతో కాసేపు మాట్లాడి, ప్రస్తుతం గ్రామాల్లో శాంతిభద్రతలు ఏ విధంగా ఉన్నాయన్న విషయం అడిగి తెలుసుకున్నారు. ఉద్దవోలుకు చెందిన మాజీ సర్పంచ్, ఉపాధ్యాయుడు ఏగిరెడ్డి కృష్ణ హత్య తర్వాత గ్రామంలో పరిస్థితులు ఏ విధంగా ఉన్నాయని ఆ గ్రామ సచివాలయ మహిళా పోలీసును అడిగారు. గ్రామంలో ప్రస్తుతం ప్రశాంత వాతావరణం నెలకొందని, శాంతిభద్రతలకు విఘాతం కలిగే పరిస్థితులు ఏమీలేవని ఉద్దవోలు మహిళా పోలీస్ తెలిపారు.

గ్రామాల్లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరిగినా వెంటనే స్థానిక ఎస్ఐతో పాటు, పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలని ఎస్పీ కోరారు. అనంతరం పోలీస్‌స్టేషన్ పరిసరాలు, రికార్డులను తనిఖీ చేసి, వాటి నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా, ఇంటర్మీడియట్‌లో అత్యధిక మార్కులు సాధించిన పెరుమాళి ఏపీ మోడల్ కళాశాల, తెర్లాం శ్రీవేంకటేశ్వర జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులకు ఎస్పీ చేతులమీదుగా నగదు బహుమతులు అందజేశారు. ఎస్ఐ ఆర్.రమేష్ విద్యార్థులను ప్రోత్సహిస్తూ ఈ ప్రోత్సాహక బహుమతులు సమకూర్చారు. ఎస్పీ మాట్లాడుతూ ఇదే స్ఫూర్తితో మరింత బాగా చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బొబ్బిలి రూరల్ సీఐ తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

● గణేశాయనమః



వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా రాజాం పట్టణంలోని మారుతీనగర్‌లో కొలువైన వినాయకునికి భక్తులు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఓం గణేశాయనమః, ఓం ఏకదంతాయనమః అని కీర్తిస్తూ కుంకుమార్చనలు చేశారు. డోలపేట, సారధి ప్రాంతాల్లోని గణపతి మండపాల వద్ద అన్నసమారాధన చేపట్టి, భక్తులకు అన్నప్రసాదం అందజేశారు.

– రాజాం సిటీ.

అర్హులందరికీ పథకాలు

- ఎంపీపీ సురేష్ ముఖర్జీ



అధికారులతో సమీక్షిస్తున్న ఎంపీపీ సురేష్ ముఖర్జీ

వంగర: అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు మంజూరు చేయాలని ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ ఆదేశించారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన ఆయన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో పాటు ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంతో ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించాలని సూచించారు. ఈ నెల 30వ తేదీన నుంచి గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, 14 రకాల వైద్యపరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు పంపిణీ చేయాలని వైద్యులు సీహెచ్ సుస్మిత దయానకు తెలిపారు. అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోతే వారి అనర్హతకు గల కారణాలు వారికి వివరించాలని, అలాగే అర్హులైన వారందరికీ పథకాలు అందేలా చూడాలన్నారు. జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలు, ప్రభుత్వ భవన నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ కరణం సుదర్శనరావు, జేసీఎస్ మండల కన్వీనర్ మరిశర్ల విజయలక్ష్మి, ఎంపీడీవో హనుమంతు శశిభూషణరావు, డీటీ బూరాడ సుందరరావు, ఏవో లోపింటి త్రినాథ్, ఈవోపీఆర్‌డీ గొబ్బూరు విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వసతిగృహాల్లో విద్యార్థులను చేర్పించాలి

- ఎంపీపీ నర్సుపల్లి ఉమాలక్ష్మి



తెర్లాం ఎస్సీ హాస్టల్‌లో రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీపీ ఉమాలక్ష్మి, ఎంపీడీవో రామకృష్ణ

తెర్లాం: మండలంలోని తెర్లాం, పెరుమాళి ఎస్సీ బాలుర వసతిగృహాల్లో పూర్తిస్థాయిలో విద్యార్థులను చేర్పించాలని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ నర్సుపల్లి ఉమాలక్ష్మి సూచించారు. శనివారం స్థానిక ఎస్సీ బాలుర వసతిగృహంలో ఎంపీడీవో శంబంగి రామకృష్ణ అధ్యక్షతన తెర్లాం, పెరుమాళి ఎస్సీ వసతిగృహాల ప్రవేశాల సలహా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఆయా వసతిగృహాల్లో ఎంతమంది విద్యార్థులను చేర్పించారని, వార్డెన్లు అప్పన్న, కృష్ణమూర్తిలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వసతిగృహాలకు పరిసర గ్రామాల్లోకి వెళ్లి, ఎస్సీ విద్యార్థులు వసతిగృహాల్లో చేరేలా వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఎంపీడీవో రామకృష్ణ మాట్లాడుతూ వసతి గృహాల్లో విద్యార్థులు తక్కువ ఉంటే ప్రభుత్వం వసతి గృహాలను మూసివేసే పరిస్థితి ఎదురవుతుందని, ఆ పరిస్థితికి తెచ్చుకోకుండా సరిపడ విద్యార్థులు వసతిగృహాల్లో ఉండేలా చూడాలన్నారు. విద్యార్థులకు సదుపాయాలన్నీ కల్పించాలని, మెనూ ప్రకారం ప్రతిరోజూ భోజనాలు పెట్టాలని, నాణ్యమైన విద్యాబోధన అందించాలన్నారు. సమావేశంలో ఎంఈవో త్రినాథరావు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోవాలి



తెర్లాం: గంగన్నపాడులో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీవో రామకృష్ణ

తెర్లాం: ప్రజారోగ్యమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో శంబంగి రామకృష్ణ కోరారు. మండలంలోని గంగన్నపాడు గ్రామంలో చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను ఆయన శనివారం పరిశీలించారు. సర్వే వివరాలను ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎం, వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైద్య సిబ్బంది ఇంటికి వచ్చినప్పుడు ప్రజలు వారికున్న అనారోగ్య సమస్యలను వారికి తెలియజేసి, టోకెన్ రాయించుకోవాలన్నారు. ఈ నెల 30 నుంచి అక్టోబరు 26వ తేదీ వరకు అన్ని వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల పరిధిలో ప్రత్యేక వైద్య శిబిరాలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ వైద్య శిబిరాల్లో ఇద్దరు స్పెషలిస్ట్ వైద్యులతో పాటు పీహెచ్‌సీలకు చెందిన ఇద్దరు వైద్యులు ఉంటారని, క్రిటికల్ కేసులకు సంబంధించి, పెద్ద ఆస్పత్రులకు రిఫర్ చేయడం జరుగుతుందన్నారు.

రాజాం సిటీ: మండలంలోని పెనుబాక గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేపై జరిగిన సమావేశంలో పాల్గొన్న ఎంపీడీవో బి.శంకరరావు మాట్లాడుతూ పక్కాగా సర్వే చేపట్టి, అనారోగ్యంతో బాధపడుతున్న వారి వివరాలను సేకరించి, వారికి వైద్య సేవలు అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ వి.శ్రీనివాసరావు, సర్పంచ్ బి.బోడెమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ పరామర్శ



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్

రేగిడి: మండలంలోని కాగితాపల్లికి చెందిన మాజీ సర్పంచ్ దూబ వెంకటరత్నం అనారోగ్యంతో మృతి చెందారు. ఈ మేరకు ఆ కుటుంబాన్ని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ శనివారం కలిసి పరామర్శించారు. అనంతరం వెంకటరత్నం కుమారుడు, హైకోర్టు సీనియర్ న్యాయవాది దూబ వెంకటనాగార్జునబాబు వద్ద ఆమె మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఎమ్మెల్సీ వెంట జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ గేదెల వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్మోహనరావు, రేగిడి పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు నెల్లి పెంటన్నాయుడు, ఎంపీటీసీ రెడ్డి నర్సింగరావు, సర్పంచ్‌లు కరణం శ్రీనివాసరావు, గంటా మోహనరావు, పాలవలస దవళేశ్వరరావు, సూరపునాయుడు మాష్టారు తదితరులు ఉన్నారు.

'స్వచ్ఛతా హి సేవా'



సువిధ కాంప్లెక్స్‌లో శుభ్రతపై అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ కమిషనర్ కృష్ణారావు

రాజాం: స్థానిక పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్, సువిధ కాంపెక్స్‌ల వద్ద స్వచ్ఛతా హి సేవా కార్యక్రమం శనివారం నిర్వహించారు. దీనిలో భాగంగా మున్సిపల్ కమిషనర్ కృష్ణారావు మరుగుదొడ్ల నిర్వాహకులకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. రాజాం పట్టణాన్ని క్లీన్ అండ్ గ్రీన్‌గా ఉంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని, దీనికి పట్టణవాసులు కూడా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ శానిటరీ ఇన్‌స్పెక్టర్ సి.హెచ్.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు

రాజాం: ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులతో పాటు ఆరోగ్యవంతమైన పంటలు చేతికి వస్తాయని వ్యవసాయ శాఖ రాజాం ఏడీఏ కె.చంద్రరావు అన్నారు. శనివారం మండలంలోని గారాజుచీపురుపల్లి యూనిట్ పరిధిలో ఉన్న బొమ్మినాయుడువలస గ్రామ పంటపొలాలను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వరిలో కాండంతొలుచుపురుగు ఎక్కువగా వస్తుందని, వీటి నివారణకు ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో అగ్ని అస్త్రం తయారుచేసి, వినియోగిస్తే మంచి ఫలితాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం యూనిట్ ఇన్‌చార్జ్ రమాదేవి పాల్గొన్నారు.

మత్తుపదార్థాలతో జీవితం చిత్తు

బొబ్బిలి: మత్తుపదార్థాలతో జీవితం చిత్తు అవుతుందని, విద్యార్థులు, యువతీ యువకులు మత్తపదార్థాలకు బానిసలై, జీవితం నాశనం చేసుకోవద్దని ఎస్ఈబీ సీఐ ఆర్.జైభీమ్ అన్నారు. మండలంలోని ఎ.వెలగవలస గ్రామంలో మత్తపదార్థాలు తీసుకోవడం వల్ల కలిగే అనర్థాలపై శనివారం అవగాహన కల్పించారు. గంజాయి, కొకై న్, హెరాయిన్, ఖైనీ, గుట్కా, సారా, మద్యం వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని తెలిపారు. ఆయా మత్తు పదార్థాలు శరీరావయాలపై ఏ విధంగా దుష్ప్రభావం చూపుతాయో వివరించారు.

ఉద్యానవనాల పెంపకంపై అవగాహన కల్పించండి

రేగిడి: ఉద్యానవనాల పెంపకంపై రైతులకు అవగాహన కల్పించండి అని ఎంపీడీవో ఎ.శ్యామలా కుమారి సూచించారు. ఇదే విషయమై స్థానిక ఉపాధి కార్యాలయంలో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లతో శనివారం సమావేశమైన ఆమె ఉపాధి హామీ పథకం ద్వారా సాగుభూమి ఉన్న రైతులకు ఉచితంగా మామిడి, కొబ్బరి, జీడి మొక్కలు ఇస్తామన్నారు. వీటిని మూడేళ్ల పాటు పెంచేందుకు ఖర్చులు కూడా చెల్లిస్తామన్నారు. కార్యక్రమంలో ఏపీఓ ఎస్.హరనాథరావు తదితరులు పాల్గొన్నారు.

దీపారాధన



కారాడలో దీపారాధన చేస్తున్న భక్తులు

బొబ్బిలి: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని కారాడ గ్రామంలో వినాయకుని మండపం వద్ద భక్తులు శనివారం దీపారాధనలు చేశారు. శివలింగాకారంలో వెలిగించిన దీపాలు, ఆ దీపపుకాంతులు అందరినీ ఆకట్టుకున్నాయి.

శిష్టకరణ కార్పొరేషన్ డైరెక్టర్ ఆకస్మిక మృతి



రామకృష్ణ(ఫైల్)

బొబ్బిలి: రాష్ట్ర శిష్టకరణ కార్పొరేషన్ డైరెక్టర్ పక్కి రామకృష్ణ(55) శనివారం ఆకస్మికంగా మృతి చెందారు. స్వగ్రామమైన మండలంలోని పక్కిలోనే వేకువజామున ఇంటి దగ్గర నుంచి ఆస్పత్రికి బయలుదేరేందుకు సిద్ధమవుతుండగా అకస్మాత్తుగా గుండెపోటుకు గురై, చనిపోయారు. ఆయన మృతి పట్ల ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు, రాష్ట్ర శిష్టకరణ కార్పొరేషన్ చైర్‌పర్సన్ అనూషా పట్నాయక్ సంతాపం ప్రకటించారు.

'హౌసింగ్ డే'

బాడంగి: స్థానిక జగనన్న కాలనీలో హౌసింగ్ డే కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేకాధికారి సి.హెచ్.సూర్యచంద్రరావు గృహ నిర్మాణాల వేగవంతం చేయాలని లబ్ధిదారులను కోరారు. అలాగే నిర్మాణాల పూర్తికి ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను వివరించారు. సకాలంలో నిర్మాణాలు చేపడుతున్న వారికి బిల్లులు త్వరితగతిన చెల్లించడంతో పాటు కోరిన వారికి వెంటనే నిర్మాణ సామగ్రి కూడా ఇవ్వడం జరుగుతోందన్నారు. ఇంకా నిర్మాణాలు ప్రారంభించని వారు వెంటనే నిర్మాణాలు చేపట్టాలని, లేకపోతే మీ ఇల్లు వేరొకరికి(అర్హులకు) ఇచ్చే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఆంజనేయులు, హౌసింగ్ ఏఈ సత్యం తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం



తెర్లాం: డి.గదబవలసలో అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

బొబ్బిలి/తెర్లాం/రాజాం/రేగిడి: తెర్లాం మండలంలోని డి.గదబవలస, బొబ్బిలి మండల కేంద్రం, రాజాం పట్టణంలోని సీతామహాలక్ష్మి కాలనీ, రేగిడి మండలంలోని ఆమదాలవలస, వన్నలి, ఉప్పర్నాయుడువలస, వండానపేట గ్రామాల్లో అన్నదాన కార్యక్రమం శనివారం నిర్వహించారు. వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా వినాయకుని మండపాల వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో వేలాది మంది భక్తులు పాల్గొని, స్వామి వారి అన్నప్రసాదం స్వీకరించారు.

నిరుపేదలకు వస్త్రాల వితరణ

బొబ్బిలి: స్థానిక తహసీల్దార్ కార్యాలయం దగ్గరి మెర్సీవాల్ వద్ద తహసీల్దార్ డోల రాజేశ్వరరావు చేతులమీదుగా నిరుపేదలకు శనివారం వస్త్రాలు వితరణ చేశారు. డీటీ బలివాడ గౌరీశంకర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పౌరసరఫరాల తహసీల్దార్ ఆర్.సాయికృష్ణ, రీసర్వే డీటీ జి.అప్పయ్య, ఆర్ఐ కల్యాణ చక్రవర్తి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై సమీక్ష



అభివృద్ధి పనులపై సమీక్షిస్తున్న మండల ప్రత్యేకాధికారి సూర్యచంద్రరావు

బాడంగి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రభుత్వ అభివృద్ధి పనులపై మండల ప్రత్యేకాధికారి సీహెచ్ సూర్యచంద్రరావు శనివారం సమీక్షించారు. గ్రామాల్లో చేపడుతున్న సచివాలయ, రైతు భరోసా కేంద్ర, హెల్త్ వెల్‌నెస్ సెంటర్ల భవనాలను అక్టోబరు 15వ తేదీలోగా పూర్తి చేయాలని సూచించారు. అలాగే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా మంజూరైన నిధులతో సీసీ రోడ్లు, కాలువల నిర్మాణం త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో ఆంజనేయులు, ఈవోపీఆర్‌డీ సూర్యనారాయణ, హౌసింగ్ ఏఈ సత్యం, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై దృష్టిసారించాలి..

రాజాం సిటీ: గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులపై మండల అధికారులు దృష్టిసారించాలని మండల ప్రత్యేకాధికారి సుధాకర్ అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వ భవన నిర్మాణాలు, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా మంజూరైన పనులు, జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణాలపై సమీక్షించారు. అలాగే త్వరలో జరగనున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంను విజయవంతం చేసేందుకు అందరూ కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో బాసూరి శంకరరావు, ఈవోపీఆర్‌డీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రామభద్రపురం: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించిన ఎంపీడీవో రమామణి, హౌసింగ్ డీఈఈ ఎస్.జె.రత్నాకర్ మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై ఆరాతీశారు. జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణాలతో పాటు ప్రభుత్వ భవన నిర్మాణాలు, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా జరుగుతున్న పనులను వేగవంతం చేయాలన్నారు. జగనన్న కాలనీ గృహాల్లో నిర్మించుకునే మరుగుదొడ్డికి రూ.12 వేలను ప్రభుత్వం అందజేస్తోందన్న విషయం లబ్ధిదారులకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఏఈఈ సింహాచలం నాయుడు తదితరులు పాల్గొన్నారు.